క్లుప్తంగా

నూతన పింఛన్ల పంపిణీ



నీలిగుంటలో పింఛను అందిస్తున్న సర్పంచు వరహాలబాబు

కోటవురట్ల: మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 279 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో ఆయా గ్రామాల్లో పింఛన్ల పంపిణీ జోరుగా సాగుతోంది. దాంతో పండగ వాతావరణం కనిపిస్తోంది. గురువారం నీలిగుంట, కె.వెంకటాపురం, కోటవురట్ల, రామచంద్రపాలెం తదితర గ్రామాల్లో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

కట్టుబోలులో కొనసాగుతున్న రీసర్వే

రాంబిల్లి : కట్టుబోలు గ్రామంలో సమగ్ర భూ సర్వే కొనసాగుతుంది. మూడు బృందాలు ఈ సర్వే నిర్వహిస్తున్నాయని వీఆర్వో రాజాన జగన్నాధరావు తెలిపారు. సర్వేకు రైతులు హాజరయ్యే సమయంలో తగిన ధృవీకరణ పత్రాలను తీసుకురావాలని ఆయన కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

రాంబిల్లి : మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను హరిపురంలో శుక్రవారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో కె.ఎస్ కొండలరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కొత్తగా మంజూరైన 205 పింఛన్లను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. కొత్తగా మంజూరైన పింఛను లబ్ధిదారులకు హరిపురం సచివాలయం వద్దకు రావాలని ఆయన కోరారు.

మృతుల కుటుంబాలకు ఆసరాగా వైఎస్సార్ బీమా



మృతుని కుటుంబానికి నగదు అందజేస్తున్న సర్పంచ్ శ్రీరాములు

ఎస్.రాయవరం : సహజ మరణాలు, ప్రమాదాల్లో కుటుంబ పెద్ద మృతి చెందినప్పుడు వైఎస్సార్ బీమా అసరాగా నిలుస్తోందని ఉప్పరాపల్లి సర్పంచ్ శానాపతి శ్రీరాములు అన్నారు. గ్రామంలో ఇటీవల పాముకాటుతో మృతి చెందిన పులి అప్పారావు కుటుంబ సభ్యులకు గురువారం రూ.10 వేలు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తుమ్మపాల వెంకటసత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోకులపాడులో నేడు 'గడప గడపకు'

ఎస్.రాయవరం : తిమ్మాపురం శివారు గోకలపాడు గ్రామంలో శుక్రవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరు అవుతున్నట్టు చెప్పారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

నేడు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

రాంబిల్లి : హరిపురంలో శుక్రవారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. వియ్యపు గిరి జ్ఞాపకార్థం హరిపురం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు నగదుతో పాటు షీల్డులను అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రైతులకు పొద్దు తిరుగుడు, నువ్వు విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్

మునగపాక : ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అరబుపాలెంలో గురువారం ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పొద్దు తిరుగుడు, నువ్వు విత్తనాలను రాయితీపై అందజేశారు. పాలసంఘ అధ్యక్షుడు గంగాధర్, ఉప సర్పంచ్ దొడ్డి కృష్ణ, ఫౌండేషన్ ఏరియా అధికారి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

రహదారి కష్టాలకు చెల్లు

- అచ్యుతాపురం–అనకాపల్లి మార్గంలో మరమ్మతులు
- సంక్రాంతిలోగా 14 కిలోమీటర్ల మేర పూర్తి
- రూ.79 లక్షల ప్రత్యేక నిధులు



చోడపల్లి వద్ద గోతులను పూడ్చి తారు వేసిన దృశ్యం



అచ్యుతాపురం-అనకాపల్లి మార్గంలో మరమ్మతు పనులు చేపడుతున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అనునిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆ మార్గానికి మరమ్మత్తులు చేపట్టాలంటే సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. రేపో మాపో ఆ రహదారిని విస్తరించేందుకు కోట్లాది రూపాయలు మంజూరు అయ్యి ఉన్నాయి. రహదారికి రెండు వైపులా ఉన్న ఆస్తులకు నష్టపరిహారం పంపిణీ చేసేందుకు రంగం సైతం సిద్ధం అయ్యింది. అయినప్పటికీ జిల్లాలోనే వాహనాల రాకపోకలకు రద్దీగా ఉంటే అచ్యుతాపురం-అనకాపల్లి మార్గం గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు శిథిలం కావడంతో మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ వినిపిస్తున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు సైతం సాంకేతిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. కానీ ప్రజల ప్రభుత్వంగా చెప్పుకొనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజావసరాలను గుర్తించింది.ముఖ్యంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజులు ఈ మార్గం ప్రాధాన్యతను గుర్తెరిగి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా 79 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించి పనులు ప్రారంభం అయ్యేందుకు మార్గదర్శకులయ్యారు.

సంక్రాంతిలోగా పనులు పూర్తి...

అచ్యుతాపురం – అనకాపల్లి మార్గం 14 కిలో మీటర్ల మేర ఉంటుంది. ఈ మార్గంలో సెజ్, ఫార్మాకు చెందిన వాహనాలు, పదుల సంఖ్యలో గ్రామాల ప్రజల రాకపోకలు సాగుతున్నాయి. మరోవైపు తంతడి, పూడిమడక,రాంబిల్లి వంటి తీర ప్రాంతాల ఎగుమతులకు హైవేను అనుసంధానం చేసే మార్గం కూడా ఇదే కావడంతో రహదారిని విస్తరించేందుకు అంతా సిద్ధం చేశారు. అయితే రైతులకు అందించే పరిహారం అంచనా, పంపిణీ వంటి అంశాల్లో ఇంకా జాప్యం ఏర్పడడంతో వాహన దారుల కష్టాలు తీర్చాలని పాలకులు చొరవ చూపారు. ముఖ్యంగా చోడపల్లి, కొండకర్ల, తిమ్మరాజుపేట, నాగులాపల్లి వంటి ప్రాంతాల వద్ద రహదారి పూర్తిగా గోతుల మయం అయ్యింది. తాత్కాలికంగా కష్టాలను తీర్చాలని మరమ్మతు పనుల కోసం 79 లక్షల రూపాయలను మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. ఈ సంక్రాంతి నాటికి రహదారి మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.

రెండు కిలోమీటర్ల మేర అదనపు లేయర్...

ఒక వైపు గోతులు ఉన్న చోట ఆ ప్రాంతాన్ని తొలగించి పూడుస్తున్నారు. మరో వైపు అదనపు లేయర్ వేయాల్సిన పరిధిని గుర్తించారు. ఇలా రెండు కిలో మీటర్ల మేర అదనపు లేయర్ వేయాలని ఆర్అండ్‌బీ శాఖ గుర్తించింది. సంక్రాంతి తర్వాత ఏ క్షణమైనా రహదారి విస్తరణ పనులు ప్రారంభం అయితే రెండేళ్ల కాల వ్యవధిలో విస్తరణ పనులు పూర్తయితే అచ్యుతాపురం-అనకాపల్లి మార్గానికి కష్టాలు శాశ్వత ప్రాతిపదికన పూర్తి అవుతాయి. ఈ లోగా తాత్కాలికంగా రవాణా కష్టాలకు చెక్ పెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో పనులు జోరుగా సాగుతున్నాయి. నిజానికి ఈ మార్గ రహదారి విస్తరణ ప్రతిపాదన ఈనాటిది కాదు. సెజ్ ఏర్పడినప్పుడే ఏపీఐఐసీ ద్వారా విస్తరించాలని ప్రయత్నించినా రహదారికి రాజకీయ గ్రహణం తప్పలేదు. నాడు రహదారిని నిర్లక్ష్యం చేసిన పార్టీకి చెందిన వారే ఇప్పుడు కంటి తుడుపు నిరసనలు చేపట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించినా, పాలక ప్రతినిధులు వారికి ఆ అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం.

సంక్రాంతి నాటికి పూర్తి

అచ్యుతాపురం-అనకాపల్లి మార్గంలో రహదారి మరమ్మతు పనులు సంక్రాంతి నాటికి పూర్తి అవుతాయి. ప్రజా ప్రతినిధుల చొరవ వల్లే రూ.79 లక్షలు మంజూరయ్యాయి. పెద్ద గోతులను పూడ్చడంతో పాటు, అదనపు లేయర్ కూడా వేయనున్నాం. – రాజు, ఆర్అండ్‌బీ జేఈ

తిరువీధుల్లో మెరిసిన దేవ దేవుడు



ఇత్తడి సప్పరం వాహనంలో దర్శనమిస్తున్న స్వామివారు



స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

- ఇత్తడి సప్పరం వాహనంపై స్వామివారు
- ఘనంగా ధనుర్మాస అధ్యయనోత్సవాలు

నక్కపల్లి : ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో దేవదేవుడు అమ్మవారితో కలసి తిరువీధుల్లో ఊరేగుతున్నారు. ఉదయం, రాత్రికూడా స్వామివారికి తిరువీది సేవలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం కొండపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం,నిత్యార్చనలు నిర్వహించారు. కొండ దిగువ ఉత్సవమూర్తులకు నిత్యపూజలు అనంతరం ధనుర్మాస పూజల్లో భాగంగా బాలబోగ నివేదన, రాజబోగనివేదన నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచారులతో కూడిన దేవదేవుడిని ఇత్తడి సప్పరం వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకీలోనూ ఊరేగించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 21వ పాశురాన్ని విన్నపం చేశారు. రాత్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



కోటవురట్లలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో గురువారం సమీక్ష చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులకు ప్రోత్సాహం ఇస్తోందన్నారు. బిల్లులు సకాలంలో మంజూరవుతున్నాయని, మెటీరియల్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని తెలిపారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చినదొడ్డిగల్లులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : పింఛన్లను రూ.2750లకు పెంచినందుకు కృతజ్ఞతగా చినదొడ్డిగల్లులో గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో పింఛను లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం ఫొటోకు క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను మూడు విడతల నుంచి పెంచుతున్నారని, దీన్ని రూ.3వేలకు పెంచుతారని వైస్ ఎంపీపీ ఈశ్వరరావు అన్నారు. వలంటీరు ద్వారా ఇళ్ల వద్దకే పింఛన్లు అందజేయడమన్నది మరే రాష్ట్రంలోను లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోట సత్తిబాబు, సర్పంచ్ ఆనందరావు, పార్టీనాయకులు లక్ష్మణరావు, దావీదురాజు, రమేష్, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పాడి రైతు బాంధవుడికి వీడ్కోలు



యలమంచిలిలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావు, మాజీ ఎంపీ చలపతిరావు

తులసీరావు సేవలు మరువలేనివి



విశాఖ డెయిరీ చైర్మన్ తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు ఎనలేని సేవలందించారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. గురువారం వాడ్రాపల్లిలో తులసీరావుకు గ్రామస్తులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ పాడి రైతులకు మెరుగైన సేవలందించడంతో పాటు వారు ఆర్థికంగా నిలబడేందుకు పాలధరలు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. డెయిరీ ద్వారా పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. దీనికి తోడు డెయిరీ ఆస్పత్రి ద్వారా పాడి రైతులకు మెరుగైన సేవలందించేందుకు తులసీరావు అందించిన సేవలు మరువలేనివన్నారు. పాలసంఘ అధ్యక్షుడు కొయిలాడ రమణబాబు, మాజీ పాలసంఘ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు, గ్రామ పెద్దలు కొయిలాడ దశావతారం, పెతకంశెట్టి శివాజీ, కొణతాల అప్పారావు, మళ్ల శేషు, కాండ్రేగుల నూక శివ అప్పారావు, భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.



ఆడారి ఆనంద్‌కుమార్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖమంత్రి అమర్‌నాథ్



తులసీరావు పార్థివదేహాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు



సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు విధులకు సక్రమంగా హాజరు కాకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని, కలెక్టర్‌కు సరెండర్ చేయాల్సి వస్తుందని ఎంపీడీవో సీతారామరాజు హెచ్చరించారు. గురువారం ఆయన దేవవరం, గొడిచర్ల సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఉన్న సచివాలయాలకు హాజరు కావడం లేదని, అందుబాటులో ఉండడం లేదని గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ఇతర సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నట్టు జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లాయన్నారు. సచివాలయాలకు వివిధ పనుల కోసం వచ్చిన సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. మూమెంట్ రిజిస్టర్లో రాసి బయటకు వెళ్లిపోతున్నారన్నారు. ఇక నుంచి అలా జరగడానికి వీల్లేదన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాల్సిందేనన్నారు. సచివాలయంలో అందుబాటులో లేని సిబ్బందిని కలెక్టర్‌కు సరెండర్ చేయాల్సి వస్తుందన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఏ సమాచారం కావాలన్నా వెంటనే ఇవ్వాలన్నారు. కొంతమంది సిబ్బంది సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇక నుంచి అటువంటి వారిని ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు. బంగారయ్యపేట సచివాలయ సిబ్బందిపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వారి విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే అక్కడ పని చేసే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ వ్యవస్థ మీద సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తే మాత్రం ఉద్యోగాల నుంచి తొలగించడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ

ప్రజల సహకారంతో గ్రామాలభివృద్ధి



చినగుమ్ములూరు గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ అప్పలనరసింహం



ఉప్పరాపల్లి గ్రామంలో నూతన పింఛనుదారులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ శ్రీరాములు

ఎస్.రాయవరం : గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం కావాలని చినగుమ్ములూరు, ఉప్పరాపల్లి సర్పంచ్‌లు గాడి అప్పలనరసింహం, శానాపతి శ్రీరాములు సూచించారు. పలు గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. విడతల వారిగా పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్‌లు హామీ ఇచ్చారు. పారిశుధ్య నిర్వహణలో గ్రామస్తుల సహకారం కావాలన్నారు.

ఉప్పరాపల్లి గ్రామంలో నూతనంగా విడదలైన పింఛన్లను గురువారం సర్పంచ్ శానాపతి శ్రీరాములు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



రీ సర్వే సందర్భంగా రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యామ్

ఎస్.రాయవరం : గ్రామాల్లో చేపట్టనున్న రీసర్వేతో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని తహసీల్దార్ శ్యామ్ తెలిపారు. భీమవరం గ్రామంలో గురువారం జగనన్న భూరక్ష రీసర్వే పనులు ప్రారంభించారు. భీమవరం గ్రామానికి సరిహద్దు గ్రామాల రైతులతో మాట్లాడారు. సర్వే పనులు చేసేటప్పుడు రైతులు సహకరిస్తే మరింత వేగవంతంగా పనులు జరుగుతాయన్నారు. ప్రభుత్వం వేల కోట్ల ఖర్చు చేసి రైతు భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ మహా కార్యక్రమం చేపట్టిందన్నారు.

ఒంపోలులో ఉచిత పశు వైద్యశిబిరం



ఒంపోలులో పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు

మునగపాక : మండలంలోని ఒంపోలు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో పశుపోషణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. లంపీస్కిన్ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీకృత దాణాను వినియోగించడం వల్ల పాల దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి భానుబాబు, రిలయన్స్ ప్రతినిధి రాము, గోపాలమిత్ర ఆర్‌డీఎస్ అప్పారావు, రైతులు బొద్దపు శ్రీరామమూర్తి, నరాల శెట్టి తాతారావు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు చేసుకోవాలి



చెరకు రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహనరావు

మునగపాక : రబీకి సంబంధించి రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహనరావు కోరారు. గురువారం ఆయన తిమ్మరాజుపేటలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈనెల 15వ తేదీలోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ సేవలు పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరన్నారు. అలాగే వ్యవసాయ కార్యాలయంలో పొద్దు తిరుగుడు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రైతులకు అవసరమయ్యే విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆమె వెంట వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వీఏఏ శ్వేతా మీనన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సభ దోహదపడుతుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల నిర్వహణపై పాలకవర్గం పాటుపడుతుందన్నారు. అవసరమైన చోట రహదారులు, మురుగుకాల్వల అభివృద్ధి, శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు

సబ్బవరం : గ్రంథాలయాలు అధునిక దేవాలయాలని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి తెలిపారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీ గ్రంథాలయాధికారి రమణ మాట్లాడుతూ ఇప్పటికే కొత్త 888 పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ పుస్తకాలను ప్రతి మండలంలోని మండల శాఖా గ్రంథాలయాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయాధికారిణి జి.సత్యవతి, ఎన్ఎస్ఎస్ అధికారి పీపీసీహెచ్ వరప్రసాద్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



నాయుడుపాలెంలో పల్లకీ సేవలో నిమగ్నమైన భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో దేవాలయ కేంద్రంగా గురువారం మేలుకొలుపు కార్యక్రమం భక్తులు నిర్వహించారు. కార్యక్రమంతో గ్రామాల్లో యువకులు, మాతృమూర్తులు, పెద్దల్లో భక్తి భావం పెరిగి పూర్వవైభవం కనిపిస్తుందని సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం ప్రతీ దేవాలయం కేంద్రంగా గ్రామస్తులంతా సామూహిక హారతి నిర్వహించాలని సూచించారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని ప్రతి గ్రామంలో జరపాల న్నారు. ఈ నెల18 నుంచి 26 వరకు పంచాయతీ కేంద్రంగా భారత మాత పూజలను గ్రామ ధార్మికజట్టుతో నిర్వహించనున్నామన్నారు.